క్లుప్తంగా

సమీక్షా సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో

కాసిపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణసింగ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామపంచాయతీలో 100శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని సాధారణ ఎన్నికల్లో భాగంగా గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితా త్వరగా తయారుచేసి టీ పోల్ ఎంట్రీ చేయడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీవో సబ్దర్‌అలీ, ఏపీవో నవీన్, ఈసీ మల్లేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



వంటగదిని పరిశీలిస్తున్న కమిషనర్

నస్పూర్: పట్టణ పరిధిలోని తినుబండారాలు విక్రయించే హోటల్, బేకరీ తదితర దుకాణాదారులు దుకాణాల్లో పరిశుభ్రత పాటించాలని పరిశుభ్రత పాటించని దుకాణాదారులకు జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ హెచ్చరించారు. తెలంగాణా తల్లి విగ్రహం సమీపంలోని బెంగుళూరు బేకరీలో మంగళవారం ఆయన తినుబండారాలను పరిశీలించారు. బేకరీలోని వంటగదిని పరిశీలించగా అందులో చిమ్నీ లేకపోవడంతో యజమానికి రూ.10,000 జరిమానా విధించారు. నిషేధిత ప్లాస్టిక్ ఎవరూ వాడరాదని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మురికి కాలువల్లో పూడికతీత

చెన్నూర్: మున్సిపాలిటీ 10వ వార్డు పరిధిలో రావిచెట్టు నుంచి హనుమాన్ మందిర్ వరకు మురికి కాలువలు లేక మురికి నీరు రోడ్డుపై పారుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకులంగా స్పందించారు. జేసీబీతో మంగళవారం మురికి కాలువల్లోని పూడికను తీయించారు. శాశ్వత కాలువల నిర్మాణాన్ని త్వరలో చేపడుతామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కౌన్సిలర్ పోగుల సతీశ్, కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్, పెద్దింటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తాండూర్: గిరిజన పోరాట యోధుడు కుమురం భీం విగ్రహ ఏర్పాటు కోసం భూమి కేటాయించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని కిష్టంపేట ఏజెన్సీ ప్రాంతం సర్వే నంబర్ 23లో ఖాళీగా ఉన్న భూమిలో ఆదివాసీ భవనం, కుమురం భీం విగ్రహ ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని విన్నవించారు. ఈ స్థలం కేటాయింపు కోసం గతంలో గ్రామ పంచాయతీ తీర్మానం కూడా చేసినట్లు తెలిపారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు సమ్మయ్య, రవీందర్, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్న గౌడ్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు

తాండూర్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను తాండూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చూపిన పోరాట పటిమ, చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, సీఐ కుమారస్వామి, నాయకులు సూరం రవీందర్ రెడ్డి, ఎం.డి ఈసా, గట్టు మురళీధర్ రావు, సాలిగామ బానయ్య, గౌడ జన హక్కుల పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట: రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

మంచిర్యాలటౌన్/కాసిపేట/మందమర్రిరూరల్/బెల్లంపల్లి/నస్పూర్/లక్సెట్టిపేట/రామకృష్ణాపూర్/భీమారం/వేమనపల్లి: దేశాన్ని ప్రగతి బాటలో నడిపించి, సాంకేతిక విప్లవంతో ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా పునాదులు వేసి, దే శం కోసం ప్రాణాలర్పించిన మహా వ్యక్తి రాజీవ్‌గాంధీ అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి సేవలను కొనియాడారు. ఆశయాల సాధన కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కాసిపేటలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.మల్లయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.శ్వేత, కాసిపేటలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మందమర్రి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురమిల్ల వేణు, కౌన్సిలర్లు తోట శ్రీనివాస్, మర్రి రాజమౌళి, కేడిక ప్రకాశ్‌రెడ్డి, పూదరి కుమార్, బెడిక లక్ష్మి, పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, లక్సెట్టిపేట పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, క్యాతనపల్లి పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



లక్సెట్టిపేట: నివాళులర్పిస్తున్న నాయకులు



వేమనపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



మంచిర్యాలటౌన్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బెల్లంపల్లి: రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



నస్పూర్: కేక్ కట్ చేస్తున్న నాయకులు



భీమారం: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



రామకృష్ణాపూర్: రాజీవ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని టౌన్–2 పరిధిలోని ఏసీసీ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ (12.5) పునరుద్ధరణ కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏడీఈ వేణుగోపాల్ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మార్కెట్ ఏరియా, జన్మభూమినగర్, జాఫర్‌నగర్, ఇక్బాల్‌ఆహ్మద్ నగర్, ఇందిరానగర్, గౌతమినగర్, ఇస్లాంపూర, హైటెక్ సిటీ, సుభాష్‌రోడ్, అండాళమ్మ కాలనీ, గ్రీన్‌సిటీ, లక్ష్మినగర్, వికాస్‌నగర్, మారుతినగర్, రాళ్లపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

బంద్ విజయవంతం చేయాలి

మంచిర్యాలటౌన్: ఈ నెల 1వ తేదీన ఎస్సీ, ఎస్టీల ఉపకులాల వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన చేపట్టనున్న భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని నాయకులు జూపాక సుధీర్, పొట్ట మధుకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తీర్పును సుప్రీంకోర్టు తీర్పుగా తాము భావించడం లేదని, నరేంద్ర మోదీ తీర్పుగా భావిస్తున్నామని, అందుకే బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ బంద్‌కు సహకరించాలని కోరారు.

22 నుంచి డిగ్రీ ఇంటర్నల్ పరీక్షలు

బెల్లంపల్లి: 2024–25విద్యా సంవత్సరంలో చేరి డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 22వ తేదీ నుంచి ఇంటర్నల్ పరీక్షలు జరుగుతాయని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు రెండు పరీక్షల చొప్పున ఈ నెల 27వరకు జరుగుతాయని తెలిపారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఆటో యూనియన్, ఆటో కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచిత కంటి వైద్య చికిత్స శిబిరం నిర్వహించినట్లు ఆటో యూనియన్ పట్టణ అధ్యక్షుడు రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని కంటి సంబంధిత వ్యాధులు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అధికారులు ఒత్తిడికి లోనుకావొద్దు

- స్వేచ్ఛగా పనిచేయండి
- నా పేరుతో పార్టీ నాయకులు అక్రమ దందాలు చేస్తే ఊరుకోను
- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మందమర్రిరూరల్: తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. సీఈఆర్ క్లబ్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటిలో అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించామని, అందులో భాగంగా రూ.20లక్షల నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్టర్లను ప్రారంభించారు. తన పేరుతో పార్టీ నాయకులు ఎలాంటి అక్రమ దందాలు చేసినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, తహసీల్దార్ సతీష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్, సుదర్శన్, సదానందం, అనుబంద సంఘాల నాయకులు ఉన్నారు.

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

చెన్నూర్: చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా మండలంలోని 41మంది లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తహసీల్దార్ మల్లిఖార్జున్ తెలిపారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పీఏసీఎస్ చైర్మన్, కోఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీకి చెందిన దాసరి ప్రతాప్‌కు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రతాప్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకున్నారు. బాధితుడు ప్రభుత్వ ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకోగా ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు అయింది. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే సహాయ నిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, పూలమ్మ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

దండేపల్లి: ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సంధ్యారాణి అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో యూఐడీఏఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కొత్త ఆధార్ కార్డుతో పాటు, ఆధార్‌లో తప్పొప్పుల సవరణలు, ఆధార్‌కు ఫోన్ నంబర్ లింకు, ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు, అందుబాటులో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ విజయ, ఆధార్ కేంద్రం నిర్వాహకురాలు తొట్ల అర్చన పాల్గొన్నారు.

ఎంపీడీవో ఎక్కడా?

కోటపల్లి: మండలానికి కేటాయించిన ఎంపీడీవో ఎవరూ? ఎక్కాడ అనేది తెలియని పరిస్థితి నెలకొంది. కోటపల్లి మండలానికి ఎన్నికల సమయంలో అదిలాబాద్ నుంచి భూమన్నకు కోటపల్లి ఎంపీడీవోగా కేటాయించగా ఇటీవల భూమన్న అనారోగ్య సమస్యలతో సెలవులపై వెళ్లారు. దీంతో మండలంలోని పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణరెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఛార్జి తీసుకుని మండల ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారి కూడా ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించిన నుంచి ఎలాంటి లీవ్ పెట్టకుండా కూతురు వివాహం ఉండటంతో రావడం లేదు. మండలానికి అధికారిక విధుల్లో తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెగ్యులర్ ఎంపీడీవో లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు విధులకు డుమ్మా కొడుతున్నారు. పింఛన్‌దారులు, ఇతరత్ర పనులపై కార్యాలయానికి వచ్చిన వారు ఎంపీడీవో లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది జీతాలు, బిల్లుల విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఉన్న ఎంపీవో సత్యనారాయణ ఇన్‌ఛార్జీగా కార్యాలయంలో ఎవరికైనా ఇస్తే ఇతరత్రా పనుల్లో ఎలాంటి అవస్థలు ఉండకపోయేది కాదు అని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. కార్యాలయంలో ఇటీవల బదిలీలో భాగంగా సూపరింటెండెంట్ బదిలీపై వెళ్లగా కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, టైపిస్టు మాత్రమే ఉండగా సమయపాలన పాటించకపోవడంతో కార్యాలయానికి అటెండర్లే దిక్కు అయ్యారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి మారుమూల మండలానికి ఎంపీడీవోను కేటాయించాలని మండలవాసులు కోరుతున్నారు. ఈ విషయంపై డీపీవో వెంకటేశ్వర్లు, జెడ్పీసీఈవో గణపతిని ఫోన్లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



తాళం వేసి ఉన్న ఎంపీడీవో గది

సబ్బెపల్లి పాఠశాలలో ఐ స్క్రీనింగ్



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖా అధికారి డాక్టర్ హరీశ్‌రాజు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఐ స్క్రీనింగ్‌లో భాగంగా ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తంగా 205మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలతో పాటు మందులు అందజేశారు. కార్యక్రమాన్ని ప్రోగ్రాం అధికారి, ఇన్‌చార్జి డెప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారి అనిత చేతుల మీదుగా ప్రారంభించగా ఆర్‌బీఎస్‌కే టీం వైద్యులు రాము, రామకృష్ణ, అప్తాల్మిక్ అధికారులు శంకర్, భాస్కర్‌రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ప్రోగ్రాం అధికారి, కీటక జనిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ అనిత ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాతావరణ మార్పుల ద్వారా వ్యాపించే కీటక జనిత వ్యాధులు అయిన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



బ్యాంకులు కిటకిట

దండేపల్లి: పంట రుణాల మాఫీతో, రుణాల రెన్యూవల్‌తో బ్యాంకులు కిటకిటలాడుతున్నాయి. రుణమాఫీ కానీ వారు, మాఫీ అయ్యిందో లేదో తెలుసుకోవడం, అయిన వారు మాఫీ సొమ్ము తీసుకోవడంతో బ్యాంకులన్ని కిక్కిరిసి కనిపిస్తున్నాయి. దండేపల్లిలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మంగళవారం రైతులతో కిటకిటలాడింది.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

భీమిని: కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో మంగళవారం ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23తేదీల్లో మహబూబబాద్ జిల్లాలో జరిగే శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మనోహర్ పిలుపునిచ్చారు. శిక్షణ తరగతులకు యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో యువకులు సమ్మయ్య, తిరుపతి, నగేష్, రాజన్న, భీంరావు, సంతోష్, నరేష్, నవీన్, అశోక్ ఉన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్, జెండావెంకటాపూర్, దౌడేపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రఘునాథ్ వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్కూల్ బ్యాగ్‌లు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొప్పు కిషన్, హేమంత్, సతీష్, మధుకర్, వంశీ, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాలికల సంరక్షణకు పథకాలు

శ్రీరాంపూర్: బాలికల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్టు విజయ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ఎయిమ్స్ స్కూల్‌లో మంగళవారం బేటీ బచావో–బేటీ పడావోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు చక్కగా చదువుకొని రాణించాలన్నారు. అక్షరాస్యత సాధిస్తేనే అభివృద్ధి గడిస్తామన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టం, సఖీ సేవలు, డిజిటల్ ఎడ్యుకేషన్, ఫోక్సోయాక్ట్ చట్టాలతో పాటు, మిషన్ వాత్సల్య, సుకన్య సంవృద్ధి యోజన వంటి పథకాల గురించి అవగాహన కల్పించారు. ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు లిప్సిక, ప్రిన్సిపాల్ మైదం రామకృష్ణ పాల్గొన్నారు.

రైతులకు చీడపీడలపై అవగాహన

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో రైతులకు వరిలో చీడపీడలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం శాస్త్రవేత్తలు ముఖాముఖి చర్చలు నిర్వహించారు. రైతులకు పంట రుణమాఫీ, పంటలను ఎలా కాపాడుకోవాలని పలు అంశాలపై చర్చించారు.

ఆకతాయిలు వేధిస్తే సమాచారం ఇవ్వాలి

లక్సెట్టిపేట: విద్యార్థినులను ఆకతాయిలు వేధిస్తే షీటీం అధికారులకు సమాచారం ఇవ్వాలని జిల్లా షీ టీం ఎస్సై హైమా అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొత్తగా పరిచయం అయిన వ్యక్తులను నమ్మొద్దని, మహిళల భద్రత కోసం షీ టీం, భరోసా సెంటర్లు పనిచేస్తాయని తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలని కోరారు. సమస్యలుంటే 100 లేదా 1930నంబరుకు డయల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది విజయ, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దండేపల్లి: మండలంలోని గుడిరేవు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ జనార్దన్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, అతడి కుటుంబానికి ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు రూ.5వేల ఆర్థిక సాయం పంపించగా, వాటిని కార్యకర్తల ద్వారా మంగళవారం అందించారు.